ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

గురువారం 4 జూలై 2024

పీఏబీఆర్ కుడి కాలువ పొడిగింపు కోసం మండల రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం పీఏబీఆర్ డ్యాం నుంచి కుడికాలువ దాదాపు 112 కిలోమీటర్లు ఉంది. ఈకాలువ ద్వారా ఉమ్మడి జిల్లాలోని 42 చెరువులకు నీరుఇచ్చేందుకు 1987లో రాష్ట్ర ప్రభుత్వం పనులు ప్రారంభించి పూర్తి చేసింది. దీంతో కనీసం రెండు సంవత్సరాలకు ఒకసారైన కుడికాలువ ద్వారా చెరువులకు నీరందిస్తున్నారు.

- తాడిమర్రి



పీఏబీఆర్ కుడికాలువ

గత టీడీపీ పాలనలోనే అనుమతులు

రూ. 950 కోట్లు విడుదలకు ఆర్థిక శాఖ ఆమోదం

అధికారం మారడంతో మొదలు కాని పనులు

కాలువ పనులు పూర్తి చేయాలంటున్న రైతులు

పొడిగిస్తే మేలే..

పీఏబీఆర్ కుడి కాలువ పొడిగింపు కోసం నిరీక్షణ

రెండు కిలోమీటర్ల పొడిగింపునకు అనుమతి

కుడి కాలువను 112 నుండి 114 కిలో మీటర్ల వరకు పొడిగించి, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఈ కాలువ నుంచి మూడు న్నర టీఎంసీల నీటిని తీసుకెళ్లేందుకు 2017లోనే ప్రతిపాదనలు తయారుచేసి, పాలన పరమైన అనుమతులు కూడా పొందారు. ఇందుకు రూ.950 కోట్ల నిధులు విడుదల చేసేందుకు రాష్ట్ర ఆర్థిక శాఖ అనుమతులు మంజూరు చేసింది. అయితే రెండు కిలోమీటర్ల మేర కొత్తగా కాలువ తవ్వేందుకు, బ్రిడ్జిలు నిర్మించేందుకు, భూమిని సేకరించడంలో జాప్యం జరిగింది.

అధికార మార్పిడితో మళ్లీ మొదటికి..

రాష్ట్రంలో 2019లో అధికారం మారడంతో భూసేకరణ వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. అప్పట్లో భూమి ఇచ్చేందుకు ఒప్పుకున్న రైతుల్లో ఒకరిద్దరు పరిహారం కోసం కోర్టుకు వెళ్లారు. తగిన పరిహారం ఇచ్చేందుకు కోర్టు అనుమతించడంతో వారు మిన్నకుండిపోయారు. కానీ అప్పటి అధికారులు, నాయకులు కాలువ తవ్వించడంలో శ్రద్ధ చూపకపోవడంతో పనులు మొదలు కాలేదు. ఈ కాలువ పనులు పూర్తి అయితే ఉమ్మడి జిల్లాలో దాదాపు 50 గ్రామాల రైతులు, ప్రజలకు సాగు, తాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ధర్మవరం నియోజవర్గంలోని బత్తలపల్లి, యర్రాయపల్లి, మాల్యవంతం, చెర్లోపల్లి, తాడిమర్రి మండలంలోని నారసింపల్లి, నిడిగల్లు, ఏకపాదంపల్లి, పిన్నదరి, పూల ఓబయ్యపల్లి, పుల్లానారాయణపల్లి, భీమరాయనపేట, మద్దలచెరువు, తాడిమర్రి, మేడిమాకులపల్లి, శివంపల్లి, మరువపల్లి, అగ్రహారం, ఆత్మకూరు గ్రామాల ప్రజలకు నీటిసమస్య తలెత్తదు. మూడున్నర టీఎంసీల నీరు ఈ కాలువ ద్వారా ప్రవహించేందుకు దాదాపు మూడు నెలల సమయం పడుతుంది. దీని వల్ల సమీపంలోని బోరుబావుల్లో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుంది.

ఖర్చులన్నీ మిగిలి పోతాయి



పీఏబీఆర్ కుడికాలువ మా గ్రామానికి పైభాగాన ఉంది. అందులో మూడునెలల పాటు నీరుపారితే మా బోరు బావుల్లో భూగర్భజలమట్టం పెరుగుతుంది. ఇక నీటి కోసం ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండదు. రైతులకు నీటి కోసం అదనంగా ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు.

- ప్రతాప్, రైతు, ఏకపాదంపల్లి



గండికోట నుంచి తరలింపు

చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ప్రస్తుతం నీటిని కడపజిల్లాలోని గండికోట రిజర్వాయర్ నుండి దుగ్గిపల్లి వరకు గ్రావీటి ద్వారా నీటిని తెస్తున్నారు. అక్కడ దాదాపు 10మీటర్ల ఎత్తు వరకు నీటిని లిఫ్ట్ చేసి గొడ్డుమర్రి, లక్షుంపల్లి మధ్యగల రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు. అక్కడి నుంచి మళ్లీ ఏడు మీటర్లు ఎత్తుకు లిఫ్ట్ చేసి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు తరలిస్తారు. దీనికి గాను ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.కోట్లలో విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఒకసారి పీఏబీఆర్ కుడి కాలువ పనులు పూర్తి చేస్తే ఉమ్మడి జిల్లాలో తాగు, సాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంతోపాటు ప్రభుత్వంపై అదనపు భారం కూడా తగ్గుతుందని రైతులు అంటున్నారు.

నీటి సమస్య ఉండదు



పీఏబీఆర్ కుడికాలువ పొడిగింపు పనులు పూర్తి చేసి కాలువకు నీరిందిస్తే మండలంలో ఎక్కడా నీటి సమస్య ఉండదు. పంటలు బాగు సాగు చేసి రైతులు కూడా ఆర్థికంగా వృద్ధి చెందే అవకాశం ఉంది. ఎంత ఎండాకాలమైనా తాగునీటికి కూడా ఇబ్బంది ఉండదు

- రామచంద్రారెడ్డి, రైతు, శివంపల్లి

నిబంధనలకు పాతర

పంట పొలాల్లో గ్రానైట్ వ్యర్థాలు

కాలుష్యమవుతున్న భూగర్భజలాలు

పట్టించుకోని అధికారులు..

ఆందోళనలో ప్రజలు



రోడ్డు పక్కనే పొలాల్లో వేసిన గ్రానైట్ వ్యర్థాలు

చిలమత్తూరు, జూలై 3: మండలంలో గ్రానైట్ పరిశ్రమల యజమానులు నిబంధనలకు పాతర వేయడంతో పంట పొలాలు, వాగులు, వంకలు, చెరువులు గ్రానైట్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. పరిశ్రమల యజమానుల నిర్లక్షయం వల్ల భూగర్భజలాలలు సైతం కాలుష్యమవుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. మండలంలోని కోడూరు, దిగువపల్లి తండా పంచాయతీల్లో సుమారు 20 వరకు గ్రానైట్ పరిశ్రమలు ఉన్నాయి. వాటి నుంచి వచ్చే వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేస్తుండటంతో అవి మట్టిలో చేరి కలుషితమవుతున్నాయి. గ్రానైట్ ముడి రాయిని తీసుకువచ్చి ఈ పరిశ్రమల్లో పలకలుగా కోసి గ్రానైట్ బండలు తయారుచేస్తారు. దాంతో పెద్ద ఎత్తున గ్రానైట్ వ్యర్థాలు మిగులుతున్నాయి. ఈ బండరాయి కటింగ్‌లో ఎక్కువగా రసాయనాలను ఉపయోగిస్తుంటారు. ఈ రసాయనాలు కలిసిన గ్రానైట్ వ్యర్థాలను సాధారణంగా నీటి ప్రవాహం లేని గుంతల్లో వేస్తారు. అయితే ఇక్కడ అలాంటి చర్యలు తీసుకోలేదు. దానికి తోడు తయారయ్యే వ్యర్థాలను రోడ్డు పక్కన, పొలాలు, వంకలు, వాగులు, నీటి ప్రవాహం ఎక్కువ ఉన్న చోట్ల పడేస్తున్నారు. కొన్ని చోట్ల ఏకంగా చెరువుల్లోకి తీసుకెళ్లి పడేస్తున్నారు. దీని వలన విపరీతమైన నీటి కాలుష్యం ఏర్పడుతోంది. వ్యర్థాలు వర్షపు నీటి వలన భూమిలో ఇంకి భూగర్భ జలాల్లో కలిసి పోతూ కాలుష్యానికి కారణమవుతున్నాయి. దీంతో భవిష్యత్తులో ఈ ప్రాంతానికి పెను ప్రమాదం పొంచి ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఇకనైనా స్పందించి గ్రానైట్ వ్యర్థాల కాలుష్యాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఊ.. అంటే వచ్చేస్తాం

టీడీపీలో చేరేందుకు వైసీపీ నాయకుల తహతహ

అవినీతి, అక్రమాల కేసుల భయంతోనే..

వద్దంటున్న టీడీపీ కిందిస్థాయి కేడర్

పుట్టపర్తి, జూలై 3: ఎవరు ఏమనుకుంటే మాకేంటి? మా పనులు సక్రమంగా సాగాలి. పైసలు జేబులోకి రావాలి. మా అవినీతి, అక్రమాలకు కొమ్ము కాస్తే టీడీపీలోకి వచ్చేందుకు మేము సిద్ధం అంటూ కొంత మంది వైసీపీ నాయకులు టీడీపీ వెంట పడుతున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కొంత మంది ఛోటానాయకులు అడ్డదిడ్డంగా అవినీతి, అక్రమాలతో కోట్లకు పడగలెత్తారు. రెండోమారు వైసీపీ అధికారంలోకి వస్తుందన్న ఆశతో ఓటర్లను అనేక రకాలుగా ప్రలోభపెట్టారు. అయితే వారి ఆశలు ఫలించలేదు. టీడీపీ అధికారంలోకి రావడంతో వారి అక్రమాలకు అడ్డుకట్టపడ్డట్లైంది. అంతేకాక కూటమి ప్రభుత్వం తమ అవినీతి అక్రమాలను ఎక్కడ వెలికితీసి ఇబ్బంది పెడుతుందోనన్న భయం పలువు రు వైసీపీ నాయకులను పట్టుకుంది. దీంతో వారు పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారు. ఆపార్టీ నాయకులతో రాయబారాలు నడిపారు. తమను పార్టీలో చేర్చుకుంటే తమ సంపాదనలో భాగం ఇస్తామంటూ ప్రలోభ పెడుతున్నారు.



జిల్లా ఏర్పాటుతో చెలరేగిన వైసీపీ నాయకులు

గత వైసీపీ ప్రభుత్వం 2022లో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఏర్పడింది. దీంతో రియల్‌ఎస్టేట్ అమాంతంగా పుంజుకుంది. ఇదే అదనుగా వైసీపీ నాయకులు చెలరేగిపోయి పేదల భూములను, ప్రభుత్వభూములను కబ్జాచేశారు. మరి కొంత మంది బెదిరింపులకు దిగి భూములను రాయించుకున్నారు. జగనన్న కాలనీల్లో బినామీపేర్లతో స్థలాలను కాజేశారు. ఈ అక్రమాన్నింటిని కప్పిపుచ్చుకునేందుకు టీడీపీలో చేరేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు.

మీకు మేము.. మాకు మీరు

వైసీపీ అధికారంలో ఉండగా మీకు మేము అండగా నిలిచాం. ఇప్పుడు మీ పార్టీ అధికారంలో ఉంది కాబట్టి మీరు మాకు అండగా నిలవాలని కొందరు టీడీపీ నాయకులతో మంతనాలు చేస్తున్నారు. మీరు వైసీపీలోకి రాకపోయినా మీపనులు సాగేలా చూశాము. ఇప్పుడు అలాకాకుండా నేరుగా మీపార్టీలో చేరుతాము మీనాయకులతో మాట్లాడి మార్గం సుగమం చేయాలని కోరుతున్నారు.

ససేమిరా అంటున్న కేడర్

అవినీతి అక్రమార్కులను టీడీపీలో చేర్చుకోవడానికి కింది స్థాయి నాయకులు, కార్యకర్తలు ససేమిరా అంటున్నారు. అయినా స్థానికంగా ఉన్న కొంత మంది ద్వితీయ శ్రేణి నాయకులు వారిని పార్టీలోకి తీసుకోవడానికి మీరు సమ్మతించాలని సంప్రదింపులు చేపట్టారు. ఎన్నికల ముందు వచ్చి ఉంటే మాకు సమ్మతమే. కానీ ఎన్నికల సందర్భంగా టీడీపీ ఓటమి కోసం దౌర్జన్యాలతో పని చేశారు. కేవలం అవినీతి, అక్రమాల కేసుల నుంచి రక్షణ పొందడానికే మనపార్టీలోకి రావడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడుతున్నారు. తాము ఎంత మాత్రం ఒప్పుకునేది లేదంటూ కరాఖండిగా చెబుతు న్నారు. ఇదీ కొందరు టీడీపీ సీనియర్ నాయకులకు మింగుడుపడటంలేదు. అయినా మరోమార్గంలోనైనా వైసీపీ వారిని పార్టీలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

కార్పొరేట్ బాధ్యతగా

టైలరింగ్ శిక్షణ

కియ ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కప్‌డాంగ్లి



శిక్షణ పూర్తి అయిన మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న కియ ప్రతినిధులు

పెనుకొండ రూరల్, జూలై 3: కార్పొరేట్ సామాజిక బాధ్యతగా గ్రామీణ మహిళలకు టైలరింగ్ శిక్షణ కోసం కియ ఇండియా సహకారం అందిస్తుందని ఆ సంస్థ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కప్‌డాంగ్లి పేర్కొన్నారు. ఇందులో భాగంగా బుధవారం టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో అమ్మవారుపల్లి, గుట్టూరు, యర్రమంచి గ్రామాల్లో నివసిస్తున్న మహిళలకు అమ్మవారిపల్లిలో ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కప్‌డాంగ్లి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత, మహిళా నైపుణ్యం వెలికి తీసి, వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కియ సంస్థ యత్నిస్తోందన్నారు. ఇందుకోసం టింబక్టివ్ కలెక్టివ్ ద్వారా కియ సమీప గ్రామాల్లోని మహిళలకు స్టైఫండ్ ఇచ్చి 90రోజుల శిక్షణా కార్యక్రమం పూర్తి చేశామన్నారు. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు యంత్రాలు, ముడిపదార్థాలు, పరికరాల కోసం రూ.40 లక్షలు కియ సంస్థ వెచ్చించినట్లు తెలిపారు. శిక్షణలో అర్హత పొందిన మహిళలందరికీ దుర్గా సొసైటీ సంస్థ ద్వారా కుట్టుమిషన్ కిట్‌లు, మిషన్ తదితరాలు అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో కియ పీఆర్‌ఓ తేజశ్విని, కియ ప్రతినిధులు, గ్రామీణ మహిళలు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు ఎంపీ బీకే స్వాగతం



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ బీకే

పుట్టపర్తి, జూలై 3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఢిల్లీ విమానాశ్రయంలో హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం రాత్రి ఘన స్వాగతం పలికారు. అదే విధంగా కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడిని ఆయన ఛాంబర్‌లో ఎంపీ మర్యాదపూర్వకంగా కలిశారు.

మాట తప్పిన గత వైసీపీ ప్రభుత్వం

ముడుపులు చెల్లించిన ఆశావహులు

అయోమయంలో అన్నదాతలు

ఎవరికీ పట్టాదా ?

భూమి పట్టాల కోసం ఎదురు చూపు

నంబులపూలకుంట, జూలై 3: సాగు చేసుకుంటున్న భూములకు పట్టాల కోసం ఏళ్ల నుంచి రైతులు ఎదురు చూస్తున్నారు. పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలిస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం ఆమాటను నిలబెట్టుకోలేదు. మండలంలో 900మందికి పైగా రైతులు 16 వందల ఎకరాల భూమికి పట్టాల కోసం నిరీక్షిస్తున్నారు. వీరందరికి పట్టాలిస్తామని అప్పట్లో గ్రామాల్లో ప్రచారం చేశారు. సాగుకు అనుకూలంగా భూమిని తీర్చిదిద్దితేనే ఆభూములను కొలతలేస్తామని అప్పట్లో సర్వేయర్లు సూచించారు. దీంతో ఎక్స్‌కవేటర్లకు గంటకు రూ.1200 ఇచ్చి బీడు భూముల్లోని కంపచెట్లు తొలగింపజేశారు. అయినా రైతులు ఆశించిన ఫలితం దక్కలేదు.



నంబులపూలకుంట తహసీల్దార్ కార్యాలయం

మామూళ్లు తీసుకుని కొలతలు

సాధారణం భూమిని కొలవాలంటే సర్వేయర్లు రావాల్సిందే. ఇందుకోసం ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. దీంతో పలువురు రైతులు అసైన్డు భూమిని సాగు చేసుకుంటున్నామని, కొలతుల వేసి, పట్టాలివ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించాలని వీఆర్‌ఓలకు తహసీల్దార్ అప్పగించారు. ఈక్రమంలోనే మామూళ్లు తీసుకుని సర్వేయర్లు కొలతలు వేశారనే ఆరోపణలు వినిపించాయి. కొంతమంది వైసీపీ నాయకులు కూడా మధ్యవర్తుల ముసుగులో కొలతలు వేయించుకుని భూములను సిద్ధం చేసుకున్నారు. ధనియాన్ చెరువు, వెలిచెలమల, మరికొమ్మదిన్నె రెవెన్యూ గ్రామాల్లో ఎక్కువగా సాగు భూమి ఉంది. దీంతో కొంతమంది రైతులు అప్పు చేసి ఎకరాకు రూ.10వేలకు పైగానే మధ్యవర్తులకు ఇచ్చిన దాఖలాలున్నాయి. పట్టాల కోసం ప్రస్తుతం ఆశావహులందరూ కార్యాలయం చుట్టు తిరుగుతున్నారు. డబ్బులు తీసుకున్న మధ్యవర్తులు మాత్రం ముఖం చాటేస్తున్నారు. మాభూములకు కొలతలు వేశారు. ఎప్పుడు పట్టా పాసుపుస్తకాలిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈనేపథ్యంలో కొందరు బ్రోకర్లు మాకు ఫలానా అధికారి తెలుసు, ఫలానా నాయకుడు తెలుసు డబ్బులిస్తే పట్టాలిపిస్తామని రైతుల నుంచి అందికాడికి దోచేస్తున్నారు. దీంతో సర్వేల కోసం ఒకసారి, పట్టాల కోసం మరో సారి చేతిచములు వదిలించుకోవడం రైతల వంతైంది.

ముఖం చాటేస్తున్న మధ్యవర్తులు

ప్రభుత్వ సాగుభూములకు పట్టాలిప్పిస్తామని ఆశ చూపి, రైతుల నుంచి వసూలు చేసిన డబ్బులు ఇవ్వకుండా, పట్టాలిప్పించకుండా మధ్యవర్తులు తప్పించుకు తిరుగుతున్నారు. ఈ వ్యవహారంలో మండలంలోని మూడు రెవెన్యూ గ్రామాల్లో కిందిస్థాయి సిబ్బంది కీలకంగా వ్యవహరించారు. అధికారులతో కుమ్మక్కై, రైతులకు పట్టాలిపిస్తామని చెప్పి, డబ్బులు వసూలు చేశారు. అయితే నేటికీ ఆ రైతులకు పట్టాలివ్వలేదు. కనీసం తీసుకున్న డబ్బులైనా ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

పాస్‌పుస్తకాలు వస్తాయని ఆశించాం



మా తాత నరసింహులు కాలంనుంచి నాలుగు ఎకరాలు సాగు చేసుకుంటున్నాం. గత ఏడాది పట్టాలిస్తామని చెప్పడంతో, పొలాలచుట్టు పిచ్చి మొక్కలు తొలగించుకుని, సాగుకు సిద్ధం చేసుకున్నాం. నాలుగెకరాల భూమికి పాస్‌పుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నాం. నేటికి పాస్‌పుస్తకాలు అందలేదు. కొత్త ప్రభుత్వమైనా మాకు న్యాయం చేయాలి.

- గురులక్ష్మీదేవి, బీమబోయనపల్లి

పాస్‌పుస్తకం ఇస్తే లోన్ తీసుకోవచ్చు



సాగులో ఉన్న భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం ఇస్తే బ్యాంక్‌లో లోన్ తీసుకుంటాం. పాస్ పుస్తకం ఇస్తారని భూమిని చదునుచేయించుకుని, కొలతలు వేసుకుని, అధికారులకు అన్నిపత్రాలు ఇచ్చాం. మాపేరుతో ఒక ఎకరాకూడా లేదు. మాకున్న నాలుగు ఎకరాల సాగు భూమికి పట్టా ఇవ్వాలనికోరాం. రెండు ఎకరాలకు ఇస్తామన్నారు. అదికూడా లేదు.

- సుమలత, ధనియాన్‌చెరువు

అసైన్‌మెంట్ అప్రూవల్ కాలేదు

మండల వ్యాప్తంగా 670మంది రైతులు డి పట్టా కోసం దరఖాస్తు చేసుకున్నారు. భూమి, రైతు వివరాలను తయారు చేశాం. అసైన్‌మెంట్ కమిటీ అప్రూవల్ కాలేదు.

- నరేంద్రకుమార్, తహసీల్దార్

విజృంభిస్తున్న డయేరియా

కిక్కిరుస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి


సౌకర్యాలు లేక బాధితుల ఇబ్బందులు

ఏళ్లు గడిచినా పూర్తికాని సీహెచ్‌సీ నిర్మాణం

కొత్తచెరువు, జూలై 3: మండలంలో డయేరియా విజృంభిస్తోంది. దీంతో రోగులు ప్రభుత్వాస్పత్రికి పరుగులు పెడుతున్నారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ (30 పడకలు)పూర్తి కాకపోవడంతో ఉన్న పాత ఆస్పత్రిలోనే అరకొర సౌకర్యాల మధ్య బాధితులు చికిత్స పొందుతున్నారు. రోజుకు 30 నుంచి 35 మంది డయేరియా బాధితులు చికిత్స కోసం ఆస్పత్రికి వస్తున్నారు. వారికి చికిత్స అందించడానికి సరైన వసతులు లేక వైద్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కొత్తచెరువులోని ప్రభుత్వ వైద్యశాలను సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేసి నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే వైసీపీ పాలనలో పనులను ముందుకు పోకపోవడంతో భవన నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో ఉన్న పాత ఆస్పత్రిలోనే వైద్యసేవలను అందిస్తున్నారు.

30 పడకల ఆస్పత్రిలో ఆరే పడకలు

కొత్తచెరువులోని పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. అయితే 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఉన్న పాత ఆస్పత్రినే 30 పడకల ఆస్పత్రిగా కొనసాగిస్తున్నారు. అయితే ఇక్కడ ఆరు పడకలు మాత్రమే ఉన్నాయి. దీంతో వివిధ రోగాలతో ఆస్పత్రికి వచ్చిన రోగులను బల్లలపై ఉంచి చికిత్స అందిస్తున్నారు. దీంతో రోగులు వారి బంధువులు ఈ అసౌకర్యాలపై మండిపడుతున్నారు.



కొత్తచెరువు సీహెచ్‌సీ ఎదుట బారులు తీరిన రోగులు



డయేరియాకు చికిత్స పొందుతున్న బాధితులు

డయేరియా.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డయేరియా వాతావరణ కాలుష్యం వల్ల (నీరు, ఆహార కాలుష్యం) వల్లసోకుతుందని డాక్టర్ అశ్వర్థకుమార్ తెలిపారు. ఈ వ్యాధి సోకితే భయపడాల్సిన అవసరం లేదని తగిన జాగ్రత్తలు తీసుకుంటే నివారించవచ్చని ఆయన తెలిపారు. ఎవరైన వాంతులు, విరేచనాలతో బాధపడుతుంటే వెంటనే ప్రభుత్వాస్పత్రిలో చికిత్స తీసుకోవాలన్నారు. వైద్యుల సలహా మేరకే మందులు వాడాలన్నారు. ఓఆర్‌ఎస్, కొబ్బరినీళ్లు తాగడం వల్ల ఈ వ్యాధి నుంచి ఉపశమనం కల్గుతుందన్నారు.

ఇంజనీరింగ్ శాఖలకు ప్రమోట్ చేయండి

సచివాలయ ఇంజనీర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మైలారప్ప, సెక్రటరీ రాఘవనాయుడు



హాజరైన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

అనంతపురం సిటీ, జూలై 3: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ ఇంజనీరింగ్ శాఖలకు ప్రమోట్ చేయడంతో పాటు అర్హులకు పదోన్నతి కల్పించాలని సచివాలయ ఇంజనీర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మైలారప్ప, సెక్రటరీ రాఘవ నాయుడు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా మైలారప్ప, సెక్రటరీగా రాఘవనాయుడు, ట్రెజరర్‌గా వీరేష్ ఎన్నికయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వివిధ శాఖలతో అనుసంధానిస్తూ పనిచేయడం జరిగిందన్నారు. టెక్నికల్, నాన్ టెక్నికల్ పనులు చేయిందడంతో పని భారం ఎక్కువైందన్నారు. జాబ్‌చార్ట్ ప్రకారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లను నాన్ టెక్నికల్ పనులకు కేటాయించరాదని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ శాఖలైన హౌసింగ్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు ప్రమోట్ చేసి అర్హతను బట్టి పదోన్నతి కల్పించాలని కోరారు.

టెట్ గడువు పొడిగించాలి: డీవైఎఫ్ఐ

అనంతపురం విద్య, జూలై 3: రాష్ట్ర ప్రభుత్వం టెట్ గడువును పొడిగించాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ నాయకులు ఏడీ కృష్ణయ్యను కోరారు. బుధవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ తదితరులు డీఈఓను కలిసి విన్నవించేందుకు డీఈఓ కార్యాలయానికి వచ్చారు. ఆమె అందుబాటులో లేకపోవడంతో ఏడీని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్ విడుదల చేయడం అభినందనీయమన్నారు. అయితే నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు నుంచి టెట్ పరీక్షకు చాలా తక్కువ సమయం ఉందన్నారు. కొత్తగా టెట్ రాయాలని అనుకున్న వారికి సిలబస్ పూర్తి చేయడానికి ఉన్న సమయం ఏమాత్రం సరిపోవన్నారు. టెట్‌కు కనీసం 100 రోజుల సమయం ఇవ్వాలని కోరారు. అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ మేరకు ఏడీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నూరుల్లా, అభ్యర్థులు చెన్నయ్య, సూరి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండగా అమిలినేని: ఆర్డీవో

డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఆర్డీవో రాణి సుష్మిత

కళ్యాణదుర్గం రూరల్, జూలై 3: నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అండగా నిలిచారని ఆర్డీవో రాణి సుష్మిత పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మెగా డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్‌ను బుధవారం ఆమె ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ డీఎస్సీ కోసం ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులకు ఉచితంగా రాష్ట్రస్థాయిలో నిష్ణాతులైన అధ్యాపకులచే శిక్షణ ఇప్పించేందుకు ఎమ్మెల్యే ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కోచింగ్ సెంటర్‌ను డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నవారు వినియోగించుకుని ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలని కోరారు. కరువు ప్రాంత నిరుద్యోగులు డీఎస్సీ కోచింగ్ కోసం సుదూర ప్రాంతాలైన అనంతపురం, విజయవాడ, హైదరాబాద్ నగరాలకు వెళ్లకుండా కళ్యాణదుర్గంలోనే మంచి కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేశారన్నారు. ఈ శిక్షణ కేంద్రంలో దాదాపు వెయ్యి మందికి పైగా శిక్షణ పొందనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో అధునాతన సీటీ స్కాన్ సేవలు



యంత్రాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

అనంతపురం టౌన్, జూలై 3: జిల్లా సర్వజన ఆస్పత్రిలో అధునాతన సీమెన్ సిటీ స్కాన్ యంత్రం సేవలను ప్రారంభించారు. గతంలో ఇక్కడ 16 స్లైస్ కెపాసిటీ యంత్రం ఉండగా ప్రస్తుతం 36 స్లైస్ కెపాసిటీ యంత్రాన్ని కొనుగోలు చేశారు. ఈ యంత్రాన్ని బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ అధునాతన సిటీస్కాన్ యంత్రం ద్వారా సూక్ష్మ లోపాలను కూడా గుర్తించవచ్చన్నారు. దీంతో రోగులకు అవసరమైన వైద్యచికిత్సలు అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి యంత్రాలు సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ఉంటాయని అలాంటి యంత్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. వైద్యులు రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, రేడియాలజీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, జూలై 3: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులైన టీచర్లు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ప్రైమరీ, అప్పర్‌ప్రైమరీ, హైస్కూళ్లలో పనిచేసే టీచర్లు, ప్రధానోపాధ్యాయులు 2024 జాతీయ ఉత్తమ టీచర్ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. టీచర్లు కనీసం 10 ఏళ్లు సర్వీసు పూర్తి చేసి ఉండాలన్నారు. దరఖాస్తులు http ://nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్‌లో పొందాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 15లోగా డీఈఓ ఆఫీస్‌లో అందజేయాలన్నారు.

జేఎన్‌టీయూ పరీక్షలు వాయిదా

అనంతపురం సెంట్రల్, జూలై 3: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించాల్సిన వివిధ పరీక్షలను వాయిదా వేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. బంద్ కారణంగా వాయిదా వేయాల్సి వచ్చిందని తిరిగి వాటిని ఎప్పుడు నిర్వహించేది జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్ ద్వారా ప్రకటిస్తామని పేర్కొన్నారు.

రేపటి నుంచి రాయచూరు ప్యాసింజరు ఆలస్యం

గుంతకల్లు, జూలై 3: గుంతకల్లు-రాయచూరు ప్యాసింజరు రైలు (నెం. 07799)ను ఈ నెల 5వ తేదీ నుంచి పొడిగించి ఆలస్యంగా గమ్యానికి చేరేలా టైంటేబుల్‌ను నిర్ణయించినట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైలు గుంతకల్లులో బయలుదేరే సమయం మునుపటి మాదిరిగానే సాయంత్రం 6-50 గంటలుగా ఉంటుందని, గమ్యస్థానమైన రాయచూరుకు రాత్రి 9-35 గంటలకు బదులు 9-50 గంటలకు చేరుకుంటుందని తెలియజేశారు.

సాగు పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు

వర్షాధారపంటల సాగుపై డాక్టర్ జాన్సన్



డాక్టర్ జాన్సన్

పుట్టపర్తిరూరల్, జూలై 3: వర్షాధార పంటల సాగులో రైతులు సరైన సాగు పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఏరువాక కోఆర్డినేటర్ డాక్టర్ జాన్సన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక దీనజనోద్ధరణ సముదాయంలోని ఏరువాక కార్యాలయంలో వర్షాధార పంటలు సాగుచేసిన, సాగుచేసే రైతులకు ఆయన పలుసూచనలు చేశారు.

● వర్షాధారపంటలను సాగుచేసే రైతులు విత్తుకోవడానికి విత్తనాలను, పురుగుమందులను సేకరించుకోవాలి. విత్తనశుద్ధి చేసి నేలలో ఉన్న తేమను బట్టి వేరుశనగ, కంది, మొక్కజొన్న, సజ్జ, ఆముదం, పంటలను సాగుచేసుకోవాలి.

వేరుశనగ, విత్తనశుద్ధి

వేరుశనగ పంటను సాగుచేసే రైతులు వెట్టబట్ట తట్టుకుని అధిక దిగుబడిని ఇచ్చే రకాలైన కదిరి-6, కదిరి-9, కదిరి హరితాంధ్ర, అనంత, గ్రీష్మ, నారాయణి, అభయ, ధరణి, కదిరి లేపాక్షి, టీసీజీఎస్-1694 రకాలను ఎంచుకోవాలి. పంట ప్రారంభ దశలో రక్షణ కల్పించడానికి విధిగా విత్తనశుద్ధి చేసుకోవాలి. ఇమిడాక్లోప్రిడ్-600 ఎఫ్ఎస్ 2మి.లీలో 4 మి.లీ నీరు కలిపి కిలో విత్తనం శుద్ధి చేసుకోవాలి. అనంతరం టెబుకొనజోల్ 2శాతం డీఎస్ 1 గ్రాము లేదా మాంకోజెబ్ 3 గ్రాములు కిలో విత్తనం, ట్రైకోడెర్మా విరిడి 8 గ్రాములు కిలో విత్తనాన్ని శుద్ధి చేయడం ద్వారా నేల ద్వారా వచ్చే వ్యాధులను నియంత్రణ చేయవచ్చు.

● వేరుశనగ పొలంచుట్టూ రక్షక పంటగా సజ్జ, జొన్న, పంటలను 4, 5 వరసలు విత్తితే రెండు కుళ్ల వైరస్ తెగుళ్లను వ్యాప్తి చేసే రసంపీల్చే పురుగులైన తామరపురుగులు వ్యాప్తిని అరికట్టవచ్చు. వేరుశనగ పంటలో అంతరపంటగా సజ్జ, కంది పంటలను 7:1, 11:1, 15:1 నిష్పత్తిలో అంతరపంటగా విత్తుకోవాలి. జూన్ మొదటివారంలో విత్తిన వేరుశనగ పంట శాఖీయ దశలో ఉంది. రైతులు అంతర సేద్యం చేసుకోవాలి.

● వేరుశనగపంటకు సంబంధించి రసంపీల్చే పురుగులను నివారించడానికి జిగటఅట్టలను ఎకరాకు 10, పెరోమాన్ ట్రాప్‌లను ఎకరాకు 4 అమర్చుకోవాలి.

● పొగాకు లద్దె పురుగు శనగ పచ్చ పురుగులు నివారించ డానికి ఎకరాకు 4 లింగాకర్షణ బుట్టలు పెట్టి మగరెక్కల పురుగులను నివారించాలి. ఎకరాకు 20 పక్షి స్థావరాలు ఏర్పాటుచేయాలి. 5 శాతం వేపగింజల కషాయం పిచికారి చేయాలి. క్వినాల్‌ఫాస్ 2 మిలీ వేపనూనె 5 మిలీ నీటికి కలిపి పిచికారి చేయాలి. ఎదిగిన లార్వాలకు ఏమామెక్టిన్ బెంజోయేట్0.4 లేదా క్లోరోపైరిపాస్ 2.5 మిలీ నీటికి కలిపి పిచికారి చేయాలి.

మొక్కజొన్న

● రైతులు మొక్క జొన్న విత్తనం జూలై 15లోపు విత్తుకోవాలి.

● కాప్టన్ లేదా మాన్కోజెబ్ 3గ్రాములు కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. దీని వల్ల లేత దశలో మొక్కలను కీటకాలు, తెగుళ్లబారి నుంచి కాపాడవచ్చు.

● మొక్కజొన్నలో కలుపు నివారణకు విత్తనం విత్తిన రెండు మూడు రోజుల్లో అట్రజిన్ కలుపు మందును తేలిక నేలలో ఎకరానికి 800గ్రాములు బరువు నేలలో 1200 గ్రాములు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి.

పత్తి

● ప్రస్తుతం పత్తిపంట జిల్లాలో కొన్ని ప్రాంతాలలో మొలకదశ నుంచి పూతదశలో ఉంది. పత్తిని విత్తిన 20 నుంచి 30 రోజులలోపు గొర్రు గుంటకలతో అంతరకృషి ద్వారా కలుపు నివారణ చేయాలి.

● రసంపీల్చే పురుగులు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు వేపనూనె 5 మిలీ లేదా 5శాతం వేపగింజల కషాయం లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి.

● తెల్లదోమను అదుపు చేయడానికి పసుపు రంగు జిగురు అట్టలను ఎకరానికి 10 ఏర్పాటుచేయాలి. సంభవనీయతను పర్యవేక్షించడానికి ఎకరాకు 10టెస్ట్, 10ఫ్లైస్టిక్ ట్రాప్‌లను ఏర్పాటుచేయాలి.

● ఇమిడాక్లోప్రిడ్ 0.4 మిలీ లేదా థయోమెథాక్జామ్ 25డబ్ల్యూ లేదా 0.2 ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి.

కంది

● కందిపంటను సాగుచేసే రైతులు పంటను బట్టి రకాలను ఎంచుకోవాలి.

● తేలికపాటి నేలల కోసం మధ్యస్థ కాలపరిమితి రకాలైన పీఆర్‌జీ -176, పీఆర్‌జీ-158, ఐసీపీఎల్84031 రకాలను ఎంచుకోవాలి.

● బరువునేలలకు మధ్యస్థ కాలపరిమితి రకాలైన ఎల్ఆర్‌జీ-41, ఎల్ఆర్‌జీ-52, ఎల్ఆర్‌జీ-105, టీఆర్‌జీ-59 వంటి రకాలను సాగుచేసుకోవచ్చు.

● కలుపు సమస్య ఎక్కువగా ఉంటే వెంటనే 24 గంటలలోపు ఎకరానికి 1.0-1.4 లీటర్ల పెండిమిథాలిన్ 200లీటర్లనీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

వరి

ప్రస్తుతం సాగుచేసేందుకు అనుకూల రకాలు సాంబమసూరి, నంద్యాలసన్నాలు, నెల్లూరుసోన, నెల్లూరు మసూరి, నంద్యాల సోన, యంటీయూ 1212, యంటీయూ1280, యంటీయూ 1281 రకాలు అనువైనవి.

● తెగుళ్లను నివారించడానికి నారుపోసేముందు తప్పనిసరిగా ఒకకిలో విత్తనానికి 1.0గ్రాముల కార్బండైజిమ్, పొడివిత్తనానికి 3.0 గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.

● 5 సెంట్ల నారుమడికి 2కిలోల నత్రజని, (4.4 కిలోల యూరియా) కిలో భాస్వరం (6.25 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్), కిలో పొటాష్ (1.6 కిలోల మ్యూరేట్ ఆఫ్‌పొటాష్) ఎరువులను వాడుకోవాలి.

ఇంటికి సౌర వెలుగులు



సోలార్ రూఫ్‌టాప్ ప్యానెల్స్

రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్రం సబ్సిడీ

ఉత్పత్తి విద్యుత్ నుంచి మిగులు డిస్కంలకు విక్రయించే వీలు

1 కేవీ నుంచి అనుమతులు

అనంతపురంరూరల్, జూలై 3: విద్యుత్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. విద్యుత్ బిల్లుల భారం తగ్గేలా పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనను ప్రకటించింది. ఇళ్లకు తగిన సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇంటి పైకప్పులకు వీటిని అమర్చి, దీని ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు. గృహ అవసరాలకు సరిపోగా మిగిలిన విద్యుత్‌ను డిస్కంలకు అమ్ముకునేలా వీలు కల్పించింది. ఉత్తమంలోనే ఆకర్షిగం వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఏపీ ఎస్పీడీసీఎల్ సంస్థ సమన్వయంతో పలు సోలార్ కంపెనీలు వీటిని ఏర్పాటు చేస్తున్నాయి. తీసుకున్నా..రూ.78వేలు సబ్సిడీ అందుతుంది. దరఖాస్తు సమయంలోనే సోలార్ ఏర్పాటు కంపెనీలకు సంబంధించిన 13వెబ్‌సైట్ల వివరాలు ఉంటాయి. దరఖాస్తుకు డిస్కమ్ క్లియరెన్స్ ఇచ్చిన తరువాత వినియోగదారులు నమోదు చేసుకున్న ఏజెన్సీ వారు రూఫ్‌టాప్‌ను ఇన్‌స్టాల్ చేస్తారు. తర్వాత వినియోగదారుడు నెట్ మీటర్ కోసం విద్యుత్ శాఖకు దరఖాస్తు చేసుకోవాలి. ఇంటి సర్వీసుకు నెట్ మీటర్ అమర్చిన తరువాత వినియోగదారుడు ఆ పోర్టల్‌లో తన బ్యాంకు ఖాతా వివరాలు అప్‌లోడ్ చేయాలి. ఆ తరువాత రాయితీ సొమ్ము 30 రోజుల్లో జమచేస్తారు.

దరఖాస్తు ఇలా..

తెలుగు వినియోగదారులు www.pmsuryaghar.gov.in. వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. ఆరు నెలలకు సంబంధించి విద్యుత్ బిల్లులను దరఖాస్తుకు జతచేయాలి. వ్యక్తిగత నివాసం సమూన, గృహ కామన్ సర్వీసుదారులకు ఈ పథకం వర్తిస్తుంది. 1 కి.వీ. సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేయదానికి ఇంటి పైకప్పు మీద 10చ.మీ.స్థలం అవసరం ఉంటుంది. 1కేవీ కెపాసిటీ కోసం 3 నుంచి 4 సోలార్ ప్యానెళ్లను 1మీటర్ వెడల్పు, 1.6 మీటర్ల ఎత్తుతో అమర్చుతారు. 1కేవీ కెపాసిటీ సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు రూ.80వేలు అవుతుంది. ఇందులో వినియోగదారుడు రూ.30 వేల సబ్సిడీ వస్తుంది. 2కేవీ కెపాసిటీ ప్యానెళ్లు రూ.1.5లక్షలు కాగా..రూ.60వేలు సబ్సిడీ వస్తుంది. 3కేవీకిపైగా ఎంత కిలో వ్యాట్స్

ఉపయోగాలు ఇవి..

1కేవీ సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్ నెలకు 125యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు 150-200యూనిట్ల మధ్య వినియోగం ఉంటుంది. 1కేవీ సోలార్ ప్యానెల్ ఏర్పాటుతో కనీస విద్యుత్ బిల్లులను పొందేందుకు వీలుంటుంది. అంతేకాకుండా సోలార్ ప్యానెళ్ల సూర్యుని వేడిని తీసుకోవడం ద్వారా ఇంటిలోపల చల్లగా ఉండేందుకు వీలుంటుంది. దీనికితోడు వినియోగదారుడు 5 నుంచి 6ఏళ్ల లోపు మూలధన వ్యయాన్ని తిరిగి పొందేందుకు అవకాశం ఉంటుంది.

విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో ఇబ్బందులు

అనంతపురం రూరల్, జూలై 3: విద్యుత్ బిల్లుల చెల్లింపులకు వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించేవారు. విద్యుత్ పంపిణీ సంస్థలు డిస్కంలకు సంబంధించిన యాప్, వెబ్‌సైట్ నుంచి బిల్లులు చెల్లించాలని ఉత్తర్వులు వెలువరించారు. అయితే ఏపీఎస్పీడీసీఎల్ యాప్ ద్వారా బిల్లులు చెల్లించేందుకు అవస్థలు పడుతున్నారు. యాప్‌లో ఫోన్ నెంబరు, ఈమెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ ఇతరత్రా నమోదు చేయాల్సి వస్తోంది. దీంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఒకవేళ అన్ని వివరాలు నమోదు చేసి బిల్లులు చెల్లిస్తే ఆ సర్వీసుకు వర్తించని మొబైల్ నెంబరు యాడ్ కానుంది. ఈ నేపథ్యంలో అదేవిధంగా తున్నా వినియోగదారులకు భవిష్యత్తులో ఇబ్బందులు వచ్చే అవకాశం లేకపోలేదు. ఇంటి నిర్మాణం చేసుకున్న తరువాత కొత్త విద్యుత్ సర్వీసు తీసుకునే సమయంలో గతంలో సర్వీసు ఉన్నట్లు చూపే అవకాశం ఉంది. ఇల్లు మారిన పాత ఇల్లు ఇంటి వివరాలు చూపే అవకాశం ఉంది. ఈక్రమంలో మళ్లీ సదరు వ్యక్తులు విద్యుత్ ఈఆర్ఓ కార్యాలయానికి వెళ్లి అర్జీకుంటున్నా సర్వీసు నెంబరుకు యాడ్ అయిన ఫోన్ నెంబరును కుటుంబులోకన్నా వస్తుంది. ఇలా కాకుండా www.apspdcl.in. వెబ్ సైట్ ద్వారా బిల్లులు చెల్లించడం ద్వారా ఇలాంటి సమస్యలుండవని సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నారు. వినియోగదారులు గూగుల్‌లో వెళ్లి వెబ్‌సైట్ ద్వారా బిల్లులు చెల్లించడం ఉత్తమం అంటున్నారు. వెబ్ సైట్‌లో బిల్ డెస్క్ మీద టచ్ చేస్తే విద్యుత్ సర్వీసు నెంబరు అడుగుతుంది. అందులో సర్వీసునెంబరు నమోదు చేసి తరువాత కింద ఉన్న మరో బాక్సులో క్యాప్చర్ నమోదు చేసి సబ్‌మిట్ కొడితే సర్వీసు నెంబరుకు సంబంధించిన వివరాలు వస్తాయి. తద్వారా ఆమౌంట్ చెల్లించవచ్చు. ఇవిధంగా చెల్లిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండదని అధికారులు అంటున్నారు.

మీ పిల్లలకైతే ఇలాగే వండిపెడతారా...?

కేజీబీవీ ఎస్ఓపై మంత్రి సవిత ఆగ్రహం.. సిబ్బందిపై చర్యలకు ఆదేశాలు



ఇన్‌చార్జ్ ఎస్ఓపై మండిపడుతున్న మంత్రి సవిత .. విద్యార్థుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హిందూపురం(సోమందేపల్లి), జూలై 3: 'మీఇంట్లో పిల్లలకు ఇలాగే భోజనం వండిపెడతారా' అంటూ స్థానిక కేజీబీవీ ఇన్‌చార్జ్ ఎస్ఓపై బీసీ సంక్షేమం, చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పాపిరెడ్డిపల్లి వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని మంత్రి సవిత బుధవారం తనిఖీ చేశారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన 'ప్రీజ్ మా సమస్యలు పరిష్కరించండి' అనే కథనంపై ఆమె స్పందించారు. కేజీబీవీలోని సౌకర్యాలు, భోజనశాల, వంటగది, హాస్టల్, మరుగుదొడ్లను మంత్రి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరు నెలలుగా హిందీ ఉపాధ్యాయిని శాలినిదేవి ఇన్‌చార్జ్ ఎస్ఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమె ఆధ్వర్యంలో కేజీబీవీ నిర్వహణ అధ్వానంగా ఉందని మంత్రి అసహనం వ్యక్తం చేశారు. వంటగదిలో కుళ్లిన కూరగాయలు, అపరిశుభ్ర వాతావరణం, లోప భూయిష్ట రేషన్ నిర్వహణను గమనించి అసహనం వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తారా అని మండిపడ్డారు. వారం నుంచి కేజీబీవీలోని సమస్యలపై 60దాకా ఫిర్యాదులు అందాయని అన్నారు. అనంతరం ఎస్ఓ, హాస్టల్ వార్డెన్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ ఎం రంగస్వామి, ఎంఈఓలు ఆంజనేయులు, ఆనంద్, టీడీపీ నాయకులు చంద్రశేఖర్, సిద్ధలింగప్ప, వెంకటరమణ, హరికృష్ణ, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ముతవల్లుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కేఎం షకీల్ షఫి



షకీల్ షఫికి శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లిం మైనార్టీ సంఘాల నాయకులు

అనంతపురం కల్చరల్, జూలై 3: రాష్ట్ర వక్ఫ్ బోర్డు అనుబంధ ముతవల్లుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా అనంతపురం నగరానికి చెందిన కేఎం షకీల్ షఫి నియమితులయ్యారు. వక్ఫ్‌బోర్డు సీఈఓ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షాహావలి ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం నగరానికి చెందిన పలువురు ముస్లిం మైనార్టీ సంఘాల నాయకులు షకీల్ షఫి నివాసానికి చేరుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో మసీదుల అభివృద్ధికి, ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సాలార్‌బాషా, ఏఐఎంఐ రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు షబ్బీర్, నాసిర్ ఖాన్, కరీముల్లా, నూర్‌మహ్మద్, అక్రమ్, అల్తాఫ్‌బాషా, జిలాన్, జాకీర్, సమీవుల్లా, తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.34

అనంతపురం రూరల్, జూలై 3: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా రూ.34 పలికాయి. బుధవారం 270 క్వింటాళ్ల టమోటా ఉత్పత్తులు మార్కెట్‌కు వచ్చాయి. కిలో గరిష్టంగా రూ.34తో అమ్ముడుపోయాయి. సరాసరి ధర రూ.30, కనిష్ట ధర రూ.26తో విక్రయాలు జరిగినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. కాగా టమోటా దిగుబడులు కాస్త పెరగడంతో బహిరంగ మార్కెట్‌లో రెండు మూడురోజులుగా టమోటా ధరలు కొంత తగ్గాయి.

చీనీ కాయలు టన్ను రూ.22వేలు

అనంతపురంరూరల్, జూలై 3: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22వేలు, కనిష్టంగా రూ.10వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్ కు మొత్తంగా 525టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

బాధ్యతల స్వీకరణ

కొత్తచెరువు, జూలై 3: శ్రీసత్యసాయిజిల్లా శ్రీ శిశు సంక్షేమశాఖ(ఐసీడీఎస్) పీడీగా నాగమల్లేశ్వరి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కృష్ణకుమారి జూన్ 30న పదవీ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో నాగమల్లేశ్వరి ఐసీడీఎస్‌పీడీగా బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు శుభాకాంక్షలు తెలిపారు.

9న జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య, జూలై 3: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 9న నిర్వహించనున్నారు. జడ్పీ సీఈఓ, ఇతర అధికారులు సర్వసభ్యసమావేశం నోటీసు మండలాలకు, ఎమ్మెల్యేలకు, జడ్పీటీసీలకు, ఇతర సభ్యులకు తెలియజేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగే తొలి సమావేశం ఇది. సభలో మెజార్టీ సభ్యులు వైసీపీ వారే ఉన్నారు. అయితే శాసనసభ్యులు, మంత్రులు కూటమి ప్రభుత్వం వారు ఉన్నారు. దీనికితోడు ఇప్పటికే పలువురు జడ్పీటీసీలు టీడీపీకిలో చేరారు. ఈ క్రమంలో 9న జరిగే సమావేశంలో చర్చలు, వాదోపవాదాలు రసవత్తరంగా ఉంటాయని జడ్పీ వర్గాల్లో చర్చనడుస్తోంది.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

గుంతకల్లు టౌన్, జూలై 3: భర్తను హత్య చేసిన కేసులో భార్య, ఆమె ప్రియుడిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య అరెస్ట్ వివరాలను వెల్లడించారు. విద్యుత్‌శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దాసరి అంజనేయులు రామిరెడ్డి కాలనీలో నివాసముంటున్నాడు. ఆయనకు దాసరి కావేరితో ఆరు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే కావేరికి ఇదివరకే పట్టణానికి చెందిన పింజరి పీరాన్‌బాషాతో కొంత కాలం క్రితం పరిచయం ఏర్పడి అదికాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ నేపథ్యంలో అంజనేయులును అడ్డుతొలగించుకోవాలని కావేరి భావించింది. జూన్ 29న అంజనేయులు మద్యం సేవించి ఇంటికి వచ్చారు. ఇదే అదనుగా భావించిన కావేరి పీరాన్‌బాషాను ఇంటికి పిలిపించుకుని అంజనేయులును హతమార్చింది. పీరాన్‌బాషా ఆధారికి వెళ్లిపోయాడు. తన భర్త గుండెపోటుతో మృతి చెందాడని అందరినీ కావేరి నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే అంజనేయులు అన్నద మ్ముళ్లకు అనుమానం రావడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కావేరి, పిరాన్‌బాషాలను అదుపులోకి తీసుకుని విచారించడంతో వారు నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి పెనుకొండ న్యాయాధికారి ఎదుటహాజరుపరచడం జరిగిందని సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



చంద్రయ్య (ఫైల్)

తాడిమర్రి, జూలై 3: మండలంలోని ఏకపాదంపల్లి గ్రామానికి చెందిన రైతు గంధ్లగొర్ల చంద్రయ్య (47) విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు ఎస్ఐ వెన్నెల తెలిపారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో నీటిని పట్టించేందుకు చంద్రయ్య ఇంటి వద్ద మోటారును ఆన్‌చేశాడు. చంద్రయ్య మోటారును తాకడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై కిందపడి పడ్డాడు. తల వెనుకభాగం కొట్టుకుని బలమైన గాయమైంది. గమనించిన కుటుంబసభ్యులు చంద్రయ్యను బత్తలపల్లి ఆర్డీటీ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



విశాల ఫెర్రర్‌తో ఎమ్మెల్యే సింధూరరెడ్డి, పల్లె కిశోర్

పుట్టపర్తి అభివృద్ధికి సహకరించండి

ఆర్డీటీని కోరిన ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

అనంతపురం రూరల్, జూలై 3: పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి తగిన సహకారం అందించాలని నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆర్డీటీ మహిళా సాధికారత విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్‌ను కోరారు. ఆ మేరకు బుధవారం రాత్రి పీవీకేకే విద్యా సంస్థల చైర్మన్ పల్లె కిశోర్‌రెడ్డితో కలసి ఆర్డీటీ కార్యాలయంలో విశాల ఫెర్రర్‌ను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. పేద విద్యార్థులు, పేద మహిళ అభివృద్ధికి ఆర్డీటీ సంస్థ చేస్తున్న సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. నియోజకవర్గంలోని పేదల ఆర్థిక అభివృద్ధికి, వారి పిల్లల విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇందుకు విశాల ఫెర్రర్ సానుకులంగా స్పందించారు. వారి వెంట బాలాజీ ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు ఉన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ముదిగుబ్బ, జూలై 3: మండలంలోని రామస్వామితండా ప్రాథమిక పాఠశాలలో బుధవారం టీడీపీ హిందూపురం పార్లమెంట్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ హేమలత బాయ్ విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిల్లు, ఇతర విద్యా సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలకు గ్యాస్ సిలిండర్, గ్యాస్ స్టౌవ్, కుళాయిలు, వితరణ చేశారు. ఈ సందర్భంగా హేమలతను ఎంఈఓ రమణప్ప, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు వెంకటేష్ నాయక్, తులసీ బాయ్ టీడీపీ నాయకులు గోనుగుంట్ల రామాంజి, గడ్డం మోహన్, చంద్ర, నంద, అబ్దుల్లా, గోపాల్ పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కేజీబీవీని తనిఖీ చేసిన ఏజీసీడీఓ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంబులపూలకుంట, జూలై 3: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో అనేక సమస్యలు తిష్ట వేశాయి. దీనిపై ఆంధ్రజ్యోతి బుధవారం ఓ కథనాన్ని ప్రచురితమైంది. స్పందించిన ఏజీసీడీఓ సంపూర్ణ, ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిడి వెంటనే ఆ పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, వంట గదిని పరిశీలించారు. సరుకులు తక్కువగా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, సమయ పాలన పాటించాలని సూచించారు. ఉపాధ్యాయుల హాజర్‌పై ఆరా తీశారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నారాయణరెడ్డి

బత్తలపల్లి, జూలై 3: బత్తలపల్లిలో ఎన్టీయార్ సుజల స్రవంతి పథకాన్ని టీడీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... ఈ పథకం ద్వారా ప్రజలకు నాణ్యమైన మంచి నీటిని అతి తక్కువ ధరకే అందిస్తామన్నారు. కార్యక్రమంలో జకరంపూటి నాగభూషణ, బొజ్జి, రమణ, సురేంద్ర, వీరనాప్ప, చితంబర్‌రెడ్డి, నారాయణస్వామి, రమేష్‌బాబు, రంగానాయుడు, మనోజ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ధర్మవరం, జూలై 3: పట్టణంలోని శివానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని టీడీపీ నాయకులు బుధవారం పరిశీలించారు. వంటలను వారే పిల్లలకు వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు అంబటి సనత్, రాళ్లపల్లి షరీఫ్, పల్లపు శివశంకర్, సీబీఎస్ రామకృష్ణ, జయలక్ష్మీ, బంధనాథం క్రిష్ణమూర్తి, ఐటీడీపీ, సోషల్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

ధర్మవరం, జూలై 3: పట్టణంలోని సుందరయ్యనగర్ కాలనీకి చెందిన నరసింహులు (78) బుధవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతని భార్య లక్ష్మీదేవి నాలుగు సంవత్సరాల క్రితమే మరణించింది. ఇతనికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నరసింహులు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెదిన ఇతను రేగాటిపల్లి రైల్వే గేటుసమీపంలో బుదవారం ఉదయం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే కీ మెన్ ఇచ్చిన సమాచారం మేరకు హిందూపురం రైల్వేపోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హిందూపురం రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి సదరం క్యాంపు

కదిరి(అమడగూరు), జూలై 3: మండలంలోని తొమ్మిది సచివాలయాల్లో గురువారం నుంచి సదరం క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అశోక్‌కుమార్ బుధవారం తెలిపారు. జూలై నుంచి సెప్టెంబరు వరకు అంగవైకల్యం పరిశీలించి ధ్రువీకరణ పత్రాలు ఇస్తామన్నారు. పేర్లు నమోదు చేసుకోవడానికి వచ్చే వారు ఒరిజినల్ ఆధార్‌తో పాటు ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఏబీవీపీ ధర్మవరం నగర కార్యదర్శిగా శ్రీనివాసులు

ధర్మవరం, జూలై 3: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ధర్మవరం నగర కార్యదర్శిగా పట్టణానికి చెందిన పామిశెట్టి శ్రీనివాసులను ఎంపిక చేశారు. స్థానిక సాయికృప కళాశాలలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వాసుదేవ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో అతన్ని ఎంపిక చేశారు. అదేవిధంగా కమిటీ నగర ఉపాధ్యక్షుడిగా కోరే చైతన్య, నగర సహాయకార్యదర్శిగా కార్తీక్, సోషల్ మీడియా కన్వీనర్‌గా వినయ్, కళామంచు కన్వీనర్‌గా శశిను ఎంపికచేశారు.

ఇరువర్గాల ఘర్షణ

ధర్మవరంరూరల్, జూలై 3: మండలంలోని పోతులనాగేపల్లి గ్రామంలో భూవివాదంలో ఇరువర్గాల వారు ఘర్షణ పడి కట్టెలతో కొట్టుకున్నారు. పోతులనాగేపల్లిలో కొన్నేళ్లుగా ఆదినారాయణ, శివయ్య, మహేష్, నాగశెట్టి... మరో వర్గం జయరాం, నాగరాజు, సూర్యనారాయణ మధ్య భూవివాదం ఉంది. బుధవారం భూమి సబ్‌డివిజన్ చేయించుకునే విషయంలో ఒకరినొకరు ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో కట్టెలతో దాడి చేశారు. ఇరువర్గాల వారూ పరస్పర ఫిర్యాదులతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చీనీ చెట్ల నరికివేత



నరికివేతకు గురైన చీనీ చెట్లు

బత్తలపల్లి, జూలై 3: మండలంలోని యర్రయపల్లి గ్రామంలో రైతు శివారెడ్డి చెందిన 66 చీని చెట్లను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. అతను ఏడాది క్రితం మూడు ఎకరాల్లో 430 చీని చెట్లు వేశాడు. బుధవారం ఉదయం పొలానికి వెళ్లిన అతను తన చీనీ చెట్లను నరికి వేసిన విషయం గుర్తించి.. ఎస్ఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ, తన సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యార్థులకు సర్టిఫికెట్ల కష్టాలు

- కుల, ఆదాయం పత్రాల కోసం పడిగాపులు..
- తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉండని సిబ్బంది



ధర్మవరం తహసీల్దార్ కార్యాలయంలోని కంప్యూటర్ రూం వద్ద వేచి ఉన్న విద్యార్థులు

ధర్మవరం రూరల్, జూలై 3: కళాశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఆ కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ అందుబాటులో ఉండకపోవడంతో విద్యార్థులు పడిగాపులు కాస్తున్నారు. గంటల కొద్ది కార్యాలయంలో నిరీక్షిస్తున్నారు. వారం రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉంది. తిరుపతి, విజయవాడకు వెళ్లే విద్యార్థులు సర్టిఫికెట్లు కోసం మళ్లీ రావాల్సి వస్తోందని వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. అధికారులు స్పందించి.. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో పాల్గొన్న ట్రాన్స్‌కో అధికారులు

ముదిగుబ్బ, జూలై 3: మండలంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఇంజనీరింగ్ సలహాదారు మండలి సభ్యులు అధికారులకు సూచించారు. బుధవారం ఎంపీపీ ఆదినారాయణ కార్యాలయంలో ట్రాన్స్‌కో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆ మండలి సభ్యులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, శివప్రసాద్ రెడ్డి, విశ్రాంత ఎస్ఈ వెంకటసుబ్బయ్య, విశ్రాంత డీఈ వేణుగోపాల్ రెడ్డి, మంత్రి సిబ్బంది హరీష్ బాబు, మల్లికార్జున మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న సమస్యలు, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవసరమైన ప్రణాళికల గురించి వారు ట్రాన్స్‌కో ఈఈ మోసెస్, ఏడీ సుబ్రమణ్యంతో చర్చించారు. మండలంలో విద్యుత్ సరఫరాలో ఆటంకాలు లేకుండా చూసే బాధ్యత అధికారులపై ఉందన్నారు. క్షేత్రస్థాయిలో వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల గురించి తెలుసుకొని వెంటనే వాటిని పరిష్కరించాలన్నారు. నిరంతర సరఫరాలో ఆటంకం ఉన్న ముదిగుబ్బ పాతూరుకు 24గంటల విద్యుత్ సరఫరా అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, ప్రధాన విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అక్కడ తలెత్తుతున్న లోపాలను సరిదిద్దాలన్నారు. మండలంలో అవసరమైన విద్యుత్ సామగ్రిని అందించేందుకు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసకెళ్లి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు



సున్నంపల్లి సచివాలయంలో డీఎల్‌డీఓ

ఓబుళదేవరచెరువు, జూలై 3: సచివాలయ సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేస్తే అలాంటివారిపై శాఖపరమైన చర్యలు తప్పవని డివిజనల్ డైవలప్‌మెంట్ అధికారి టీ శివారెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని కొండకమర్ల 1, 2, ఇనగలూరు, సున్నంపల్లి, వెంకటాపురం, తుమ్మలకుంట్లపల్లి తదితర గ్రామ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరును పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విధులు నిర్వహించాలన్నారు. సాయంత్రం 5గంటల సమయంలో బయో మెట్రిక్ వేసి వెళ్లాలన్నారు. కొంతమంది సిబ్బంది విధులకు హాజరుకాకుండా డుమ్మా కొడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటివారిపై ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు చేపడతామన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆయన వెంట ఈఓఆర్‌డి రాజశేఖర్, కార్యదర్శులు విశ్వనాథ్‌రెడ్డి, నౌషాద్, శ్రీకాంత్ ఉన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టండి

నల్లమాడ, జూలై 3: మండలంలోని చౌటకుంటపల్లి నుంచి దొన్నికోట మీదుగా కదిరికి వెళ్లే లింక్ రోడ్డు దుర్భరంగా ఉందని, దానికి మరమ్మతులు చేపట్టేలా అధికా రులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ లింక్ రోడ్డు మూడు కిలోమీటర్లు ఉందని, ఈ రోడ్డు మొత్తం పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కదిరి నుంచి దొన్నికోట మీదుగా నల్లమాడకు వెళ్లే బస్సు గతంలో చౌటకుంటపల్లి మీదుగా వెళ్లేవని, ఈ రోడ్డు గుంతలమయంగా మారడంతో బస్సును కదిరి నుంచి దొన్నికోట, ఎద్దులవాండ్లపల్లిత తండల మీదుగా నల్లమా డకు నడిపిస్తున్నారని వాపోయారు. ఈ రోడ్డు మరమ్మ తులు చేస్తే ఆ బస్సు చౌటకుంటపల్లి, ఎద్దులవండ్లపల్లి మీదుగా వెళ్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



చౌటకుంటపల్లి - దొన్నికోట రోడ్డు దుస్థితి



మల్లమీదపల్లి హెల్త్ క్లినిక్ భవనం

ఆగిన హెల్త్ క్లినిక్ నిర్మాణం

గాండ్లపెంట, జూలై 3: మండలంలోని మల్లమీదపల్లిలో హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులు పూర్తిగా ఆగిపోయాయి. ఈ భవన నిర్మాణానికి దాదాపు రూ. 21 లక్షలు కేటాయించారు. రెండేళ్ల కిత్రం ఈ భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అయితే చేసిన పనులకు గత వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు ఆ పనులను పూర్తిగా నిలిపివేశాడు. దీంతో హెల్త్ క్లినిక్‌ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

పట్టించుకోని విద్యుత్ శాఖాధికారులు

గాండ్లపెంట : స్థానిక కదిరి, రాయచోటి రహదారిలో ఓ ఇంటి వద్ద ఇలా విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో .. ఇంటి సమీపంలో ఉన్నాయి. ఆ ఇంటికి ఆనుకొని మరికొన్ని ఇళ్లు ఉన్నాయి. వర్షం వచ్చినప్పుడు పొరపాటున ఒక ఇంటికి విద్యుత్ సరఫరా అయితే.. మిగిలిన ఇళ్లకూ సరఫరా అయ్యే ప్రమాదముంది. దీంతో ప్రాణ నష్టం జరిగే ప్రమాదముంది. దీనిపై ఆ ఇంటి యజమాని పలుమార్లు విద్యుఖ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నాడు. ఇప్పటికైనా ప్రమాదం జరగకముందే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాడు.



ఇంటికి సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓలు

ముదిగుబ్బ, జూలై 3: మండలంలోని బ్రహ్మదేవరమర్రి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-1 కిరణ్మయి, ఎంఈఓ-2 రమణప్ప బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు తదితర అంశాల గురించి ఆరా తీశారు. ఎంఈఓలు మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారం విద్యార్థులకు అందేలా చూడాలని, తాగునీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కాటన్ బ్యాగుల పంపిణీ

కదిరిఅర్బన్, జూలై 3: హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండల పరిధిలోని బోడేనాయక్ తండా, మీటే నాయక్ తండాల్లో కాటన్ బ్యాగులను బుధవారం పంపిణీ చేశారు. ప్లాస్టిక్ నియంత్ర దినోత్సవం సందర్భంగా ఈకార్యక్రమం చేపట్టినట్లు ఆ ట్రస్టు ఛైర్మన్ మూడే రవినాయక్ పేర్కొన్నారు. ప్రతి ఒకరు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి కాటన్ బ్యాగులు వినియోగించాలని కోరారు. ఇంటింటికి తిరిగి కాటన్ బ్యాగులు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామక్రిష్ణనాయక్, ఈశ్వర్‌నాయక్, నాగేంద్ర, రమేష్, రమణనాయక్ పాల్గొన్నారు.



కాటన్ బ్యాగులను ప్రదర్శిస్తున్న సభ్యులు

టీడీపీ, వైసీపీ నాయకుల బాహాబాహి

కులం పేరుతో దూషించిన వైసీపీ నాయకుడు



గొడవ పడుతున్న నాయకులు

కదిరి, జూలై 3: పట్టణంలోని టవర్‌క్లాక్ వద్ద బుధవారం టీడీపీ, వైసీపీ నాయకులు బాహాబాహీకి దిగారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు వరకు వివరాలు ఇలా ఉన్నాయి. టీడీపీకి చెందిన సూర్యశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్, మరికొంతమంది వైసీపీ సోషియల్ మీడియాకు చెందిన రాయలసీమ సర్కిల్ సమీపంలో ఉన్న అంజాద్‌ఖాన్ బట్టల దుకాణం వద్దకు వెళ్లారు. తమకు ఇవ్వాల్సిన రూ. రెండు లక్షలు ఇవ్వాలని అంజాద్ ఖాన్‌ను టీడీపీ నాయకులు కోరారు. తాను ఎవరికి బాకీ లేనని, టీడీపీ నాయకులపై వైసీపీ నాయకులు దుర్భాషలాడారు. విశ్వనాథ్‌ను కులం పేరుతో దూషించారు. అంతేకాకుండా అక్కడ వైసీపీ నాయకులు ఖజాతో పాటు మరో ఇద్దరు టీడీపీ నాయకులు సూర్యశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్‌తోపాటు మరో ఇద్దరు బాహాబాహికి దిగారు. ఇంతలోపు పోలీసులు అక్కడికి చేరుకుని, ఇరువర్గాలను చెదరగొట్టారు. వైసీపీ, టీడీపీ నాయకులు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ ఫిర్యాదులపై దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పుల్లయ్య తెలిపారు.

కుల, ఆదాయ పత్రాల మంజూరుపై నిర్లక్ష్యం వద్దు

కొత్తచెరువు, జూలై 3: కులం, ఆదాయం సర్టిఫికెట్ల జారీ విషయంలో వీఆర్వోలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తహసీల్దార్ కళావతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటి తహసీల్దార్ స్వాతి, వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కొత్తచెరువు మండలవ్యాప్తంగా ఇప్పటి వరకు 2024 మంది కుల ధ్రువీకరణ పత్రాలు పొందలేదన్నారు. వారికి కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆదాయ ధ్రువీకరణ పత్రాలనూ అందజేయాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వపథకాలపై అవగాహన కల్పించాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే సమయంలో వారు ఓసీ, బీసీ, ఎస్సీనా అని క్షేత్రస్థాయిలో విచారించిన తరువాతే పత్రాలు అందజేయాలన్నారు. ఇందులో ఏవైనా తప్పులు దొర్లితే వీఆర్వోలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

ఎస్టీ విద్యార్థులకు ఉచిత టెట్, డీఎస్సీ శిక్షణ ఇవ్వాలి

ఓబుళదేవరచెరువు, జూలై 3: ఎస్టీ విద్యార్థులకు ఉచితంగా డీఎస్సీ, టెట్ కోచింగ్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర శిశు, గిరిజన సంక్షేమశాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణిని కోరినట్లు ట్రైబుల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు అక్కులప్ప నాయక్ తెలిపారు. ఈ మేరకు తాము బుధవారం అమరావతి సచివాలయంలో మంత్రికి వినతిపత్రం అందించినట్లు చెప్పారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ఆయన వెంట రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ చంద్రప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణునాయక్ ఉన్నారు.



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోండి



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ధర్మవరం రూరల్, జూలై 3: పట్టణంలో అధికఫీజులు వసూళ్లు చేస్తున్న ఓ ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంఈఓ గోపాల్‌నాయక్‌కు వినతిపత్రం అందించిన వారు మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలో కనీస సౌకర్యాలు లేవని, దీనిపై గతంలో పలుమార్లు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని వాపోయారు. వేల సంఖ్యలో విద్యార్థులున్నా కేవలం 10 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఐక్యవిద్యార్థి సంఘాల పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజూరు నరేంద్ర, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి పోతలయ్య, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నిరంజన్, నాయకులు నందకిషోర్, సునీల్, సుకృత్, సాయినాథ్, పురుషోత్తం, భరత్, కిషోర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను కేటాయించండి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొత్తచెరువు, జూలై 3 : హిందూపురం మున్సిపాలిటీ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, టీచర్లను కేటాయించి సమస్యను పరిష్కరించాలని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షిని యూటీఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం డీఈఓ చాంబర్‌లో ఆమెకు వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల బోధనకు ఆటంకం కలుగుతోందని, దీని వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు. అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూడా అవసరమైన మేరకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని, సబ్జెక్టుల వారీగా పోస్టులను మంజూరు చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, జీసీ నరేశ్‌కుమార్, సుధాకర్, బాబు, లక్ష్మీనారాయణ ఉన్నారు.

శ్రీవారి సేవలో కర్ణాటక మంత్రి



కర్ణాటక మంత్రికి స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు

కదిరి : పట్టణంలోని శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని కర్ణాటక పౌరసరఫరాల శాఖా మంత్రి కేహెచ్ మునియ్యప్ప బుధవారం దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు స్వామివారి చిత్రపటాన్ని అందించి సన్మానించారు. ఇందులో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

అతిసారపై అవగాహన ర్యాలీ

పుట్టపర్తి రూరల్, జూలై 3 : పట్టణంలోని కోటవీధిలో అతిసార నియంత్రణపై కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నగేష్ ఆధ్వర్యంలో వైద్య ఉద్యోగులు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది అనుపమ, వీరచెన్నమ్మ, మంజుల, రత్నకుమారి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

7న జగన్నాథ రథయాత్ర

హిందూపురం అర్బన్, జూలై 3: పట్టణంలో ఈ నెల 7న జగన్నాథ రథయాత్రను నిర్వహించ తలపెట్టినట్లు హరినామ సంకీర్తన కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి ఏటా మాదిరిగానే ఒరిస్సాలోని పూరిలో జగన్నా థుడి రథయాత్ర సందర్భంగా 7వ తేదీన హిందూపురం కొల్హాపురమ్మ దేవాలయంలో ఉదయం 6 గంటల నుంచి గరుపూజ, పంచామృతాభిషేకం, పుష్పయాగం, జగన్నాథలీల ప్రవచనం జరుగుతాయన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి రథయాత్ర చేపడతారన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి రూ.16 లక్షల విరాళం


విరాళం రసీదులను చూపుతున్న ఆలయ కమిటీ సభ్యులు

హిందూపురం అర్బన్, జూలై 3: పట్టణ నడిబొడ్డున గాంధీ సర్కిల్‌లో నిర్మంచ తలపెట్టిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి శాశ్వత ట్రస్టీలు రూ. 16,08,928 విరాళంగా అందించారు. ఆలయ నిర్మాణానికి ఒక్కొక్కరు రూ. 2,01,116 విరాళంగా అందించి ఆలయ ఖజానాకు డిపాజిట్ చేశారు. అతి త్వరలో ఆలయ నిర్మాణ పనులు చేపడతామన్నారు. ఆలయ నిర్మాణానికి దాదాపు రూ. 6 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు జేఈ వెంకటస్వామి, అధ్యక్షుడు రాఘవేంద్ర, ఉపాధ్యక్షుడు అంబికా రఘునాథ్, కార్యదర్శి నిమ్మకాయల రాము, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువులకు వ్యాక్సినేషన్

హిందూపురం(సోమందేపల్లి), జూలై 3 : మండలంలోని కొలిమిపల్లి, పత్తికుంటపల్లి, చిన్నబాబయ్యపల్లిల్లో బుధవారం వైద్యాధికారులు, సిబ్బంది పాడిపశువులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. గొంతువాపు, సొప్పవాపు వ్యాధులతో గత పది రోజుల్లో పదికిపైగా పశువులు మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మిగిలిన పాడిపశువులకు వ్యాధి ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా వ్యాక్సిన్ వేస్తున్నట్లు డీఏహెచ్‌ఓ శుభదాస్ పేర్కొన్నారు. గొంతువాపు, సొప్పవాపు వ్యాధులు సోకడంతో పాడిఆవులు, దూడలు చనిపోయాయని ఆయన పేర్కొన్నారు. వ్యాధి ప్రబలిన గ్రామాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని పశువులకు సైతం గురువారం వ్యాక్సిన్ వేస్తామ న్నారు. కార్యక్రమంలో ల్యాబ్ ఏడీ రామచంద్రయ్య, వైద్యులు బాలాజీనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

అమరాపురంలో రేపు ప్రజావేదిక

మడకశిర(అమరాపురం), జూలై 3: అమరాపురం మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదికలపై శుక్రవారం ప్రజావేదికను నిర్వహిస్తున్నట్లు ఏపీఓ జగదీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా విజిలెన్స్ అధికారి, ఏపీడీల సమక్షంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

మాజీ ఎంపీటీసీకి ఎమ్మెల్యే పరామర్శ

రొళ్ల, జూలై 3: మండలంలోని దొడ్డేరి పంచాయతీ మాజీ ఎంపీటీసీ చంద్రప్ప బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను బుధవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పరామర్శించారు. ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీపతి, ఉమేష్, మురళి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ

పెనుకొండ, జూలై 3 : పట్టణంలోని సరస్వతి విద్యామందిరం పాఠశాల విద్యార్థులకు స్థానిక పశ్వా పార్శ్వనాథ స్వామి ఆలయ ట్రస్ట్ తరుపున ఉచితంగా నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక పాఠశాలలో బుధవారం జైన దేవాలయం అధ్యక్షుడు అజిత ప్రసాద్ జైన్ 250మంది విద్యా ర్థులకు నోటుపుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ సభ్యుడు సుధాకర్ గుప్త మాట్లాడుతూ.. 12ఏళ్లుగా విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు అందిస్తున్న ట్రస్ట్‌సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాలూరి క్రిష్ణమూర్తి, సుధాకర్‌గుప్త, నామామురళి, చలపతిరావు, హెచ్‌ఎం పద్మజమ్మ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

బావిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

హిందూపురం(సోమందేపల్లి), జూలై 3 : మండల పరిధిలోని మంచేపల్లి పరిసరాల్లో మెట్ల బావిలో ఈతకు వెళ్లి గల్లంతైన నేపాల్ వాసి ప్రేమ్ బహదూర్(40) మృతదేహం బుధవారం లభ్యమైంది. అతడు మరువకుంటపల్లి రాజశేఖర్ ఎస్టేట్‌లో కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంచేపల్లిలో ఈత కోసం వెళ్లి బావిలో గల్లంతయ్యాడు. అతడి మృతదేహాన్ని అగ్నిమాపక సిబ్బంది బుధవారం బావి నుంచి వెలికితీశారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ

●వ్యక్తికి తీవ్ర గాయాలు

మడకశిర రూరల్, జూలై 3 : మడకశిర- హిందూపురం ప్రధాన రహదారిలో అయ్యావారిపల్లి క్రాస్ వద్ద బుధవారం సాయంత్రం కారు, ద్విచక్రవాహనం ఢీ కొనడంతో గోవిందప్ప అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని ఈచలెడ్డి గ్రామానికి చెందిన గోవిందప్ప ద్విచక్రవాహనంలో మడకశిరకు వెళ్తున్నాడు. హిందూపురం నుంచి మడకశిరకు కారు వెళ్తోంది. అయ్యావారిపల్లి క్రాస్ వద రోడ్డు మలుపులో ద్విచక్రవాహనం కారును ఢీకొంది. గోవిందప్పకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించారు. గాయపడిన అతడిని మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హిందూపురం, జూలై 3 : కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్‌సీఐ రాజశేఖర్ గౌడ్ తెలిపారు. కర్ణాటక నుంచి బుధవారం ద్విచక్రవాహనంలో ఆరు బాక్సుల మద్యాన్ని తీసుకొస్తుండగా హిందూపురం మండలం జీవ్‌మాకులపల్లి వద్ద సెబ్ పోలీసులు తనిఖీల్లో పట్టుబడిందిని తెలిపారు. కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టుచేసి, ద్విచక్రవాహనాన్ని సీజ్‌చేసి కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

భారం.. హిందూపురం ప్రయాణం..!

● సర్వీసుల ఆలస్యంపై ప్రయాణికుల మండిపాటు

అనంతపురం కల్చరల్, జూలై 3: హిందూపురం రూట్‌లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ప్రయాణికుల పాలిట భారంగా మారింది. సకాలంలో సర్వీసులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు మండిపాటుకు గురవుతున్నారు. అనంతపురం నుంచి హిందూపురం వెళ్లేందుకు బుధవారం ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు దాదాపు 150 మందికి పైగా ప్రయాణికులు అనంతపురం బస్టాండులో వేచిచూడడం కనిపించింది. హిందూపురంతోపాటు అదే రూట్‌లో పెనుకొండ, ఎస్ఎస్ గేట్, సీకే పల్లి తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు దాదాపు గంటన్నరకుపైగా బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. చంటిపిల్లలతో ఉన్న తల్లులు మొదలుకొని వృద్ధులు బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి రావడంతో ఆర్టీసీ అధికారుల అలసత్వంపై ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. ఇప్పటికైనా బస్సు సర్వీసులను పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.


హిందూపురం రూట్ బస్సులకోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

నిజాయతీగా ఉన్న వలంటీర్లకు అన్యాయం జరగదు

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, జూలై 3: ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందే మేనిఫెస్టోలో వలంటీర్లకు రూ.10వేలు జీతం అందిస్తామని హామీ ఇచ్చినా, కొంత మంది వైసీపీకి అనుకూలంగా పనిచేశారని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. నీతి నిజాయతీగా పనిచేసిన వలంటీర్లకు ఏ మాత్రం అన్యాయం జరుగదన్నారు. మండలంలోని వలంటీర్లు బుధవారం సాయంత్రం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే ఎంఎస్ రాజును, గుండమల తెప్పేస్వా మిని కలిసి తమను కొనసాగించాలని, తాము వైసీపీకి అనుకూలంగా పనిచేయలేదని విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నీతి నిజా యతీగా పనిచేసిన వారికి నష్టం ఉండదని, పూర్తిగా వైసీపీకి కొమ్ముకొసిన వారిని క్షమించే ప్రసక్తే లేదన్నారు.


వలంటీర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

ప్రతి హామీని నెరవేర్చడమే లక్ష్యం

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడమే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చామని వాటిని వందశాతం అమలు సేందుకు కృషి చేస్తున్నామన్నారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథిగృహంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు చీపులేటి గ్రామం వద్ద ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ పరిశ్రమను ప్రారంభించి, స్థానికంగా ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ఈనెల 7న పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో గార్మెంట్స్ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు రెండు వేల మంది కార్మికులు అవసరం అన్నారు. ఈ అవకాశాన్ని మడకశిర నియోజకవర్గం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్‌మేళా వాల్‌పోస్టర్‌లను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షులు మనోహర్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు భక్తర్, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీపై చర్యలు తీసుకోవాలి

●ఆశా కార్యకర్తల డిమాండ్ ● విధుల్లోకెళ్లకుండా సమ్మె

గోరంట్ల, జూలై 3: ఆశా కార్యకర్త శబరి ఆత్మహత్యాయత్నం ఘటనపై న్యాయం చేయాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో గోరంట్ల మండలంలోని ఆశాకార్యకర్తలు బుధవారం విధులు బహిష్కరించి, సమ్మె చేపట్టారు. ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి వేధింపులకు గురి చేసిందంటూ మే 7న గోరంట్ల రెండో వార్డు ఆశా కార్యకర్త శబరి విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. గౌతమిని సస్పెండ్ చేసి, శాఖానరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మండలపరిధిలోని ఆశా కార్యకర్త లు సమ్మెకు దిగారు. విధులను బహిష్కరించి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ అక్బల్ బాషాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... గౌతమిపై గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. దీంతో ఆమెలో మార్పురాకపోగా, సూటిపోటీ మాటలతో ఆశా కార్యకర్త శబరిని చిత్ర హింసలకు గురి చేస్తోందని ఆరోపించారు. డయేరియా, అతిసార లాంటి వ్యాధులు తీవ్రమైన నేపద్యంలో మండలంలోని 66మంది ఆశకార్యకర్తలు విధులు బహిష్కరించడంతో ఆరోగ్య శాఖాధికారులు స్పందించారు. పుట్టపర్తి డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సునీల్‌కుమార్ నేరుగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి, ఆశాకార్యకర్తలతో చర్చించారు. తిరిగి సాయంత్రం స్థానిక వాసవి మహల్‌లో ఆయన వైద్యాధికారి శ్రుతి, ఆరోగ్యవిస్తరణాధికారి రమణ, ఎంఎల్‌హెచ్‌పీ గౌతమితో కలిసి ఆశా కార్యకర్తలు, కార్మిక సంఘం నాయకులు చర్చించారు. రాజీ కుదిర్చే ప్రయత్నం ఫలించకపోవడంతో సమ్మె కొనసాగించనున్నట్లు ఆశా కార్యకర్తల యూనియన్ ప్రకటించింది.


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆశాలతో చర్చిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ బీకే


కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశమైన ఎంపీ పార్థసారథి

హిందూపురం, జూలై 3: కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడిని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని ఆయన నివాసంలో కలిసి పుట్టపర్తి విమానాశ్రయంతో పాటు రాయలసీమలో విమానాశ్రయాలకు సంబంధించి అభివృద్ధిపై చర్చించినట్లు తెలిపారు.

ఖరీఫ్ సాగుపై సమగ్ర శిక్షణ ఇవ్వండి : ఏడీఏ

పెనుకొండ రూరల్, జూలై 3 : ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసే పంటలపై సమగ్ర శిక్షణ ఇవ్వాలని వ్యవసాయశాఖ ఏడీ సనావుల్లా, డీఆర్‌సీ అబ్దుల్ అలీ స్థానిక వ్యవసాయాధికారులకు సూచించారు. పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం పెనుకొండ డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులతో వారు సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటల సాగుకు సిద్ధం అవుతున్నారన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందించాలన్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, కంది సాగుచేస్తుంటారన్నారు. అలాగే వరిసాగుచేసిన 15, 18రోజుల నుంచి కలుప నివారణ మందు పిచికారి చేయాలన్నారు. వరిపంటను ఆశించే సుడిదోమ నివారణకు పెక్సిలాన్ 110ఎంఎల్‌ను లీటరు నీటిలో కలిపి ఎకరాకు పిచికారి చేయాలన్నారు. కందిలో ఎల్‌ఆర్‌జి 52 రకం విత్తనాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. డ్రోన్‌ద్వారా పురుగుల మందు పిచికారి, సేంద్రియ ఎరువులు ప్రయోజ నాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ స్వయంప్రభ, ఏఓ చందన, ఏఈఓ-2 రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

ధర్మవరం రూరల్, జూలై 3: మండలంలోని పోతులనాగేపల్లి గ్రామంలో భూవివాదంలో ఇరువర్గాల వారు ఘర్షణ పడి కట్టెలతో కొట్టుకున్నారు. పోతులనాగేపల్లిలో కొన్నేళ్లుగా ఆదినారాయణ, శివయ్య, మహేష్, నాగశెట్టి... మరో వర్గం జయరాం, నాగరాజు, సూర్యనారాయణ మధ్య భూవివాదం ఉంది. బుధవారం భూమి సబ్‌డివిజన్ చేయించుకునే విషయంలో ఒకరినొకరు ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో కట్టెలతో దాడి చేశారు. ఇరువర్గాల వారూ పరస్పర ఫిర్యాదులతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయులను కేటాయించండి


డీఈఓ మీనాక్షికి వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొత్తచెరువు, జూలై 3 : హిందూపురం మున్సిపాలిటీ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, టీచర్లను కేటాయించి సమస్యను పరిష్కరించాలని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షిని యూటీఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం డీఈఓ చాంబర్‌లో ఆమెకు వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల బోధనకు ఆటంకం కలుగుతోందని, దీని వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు. అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూడా అవసరమైన మేరకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని, సబ్జెక్టుల వారీగా పోస్టులను మంజూరు చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, జీసీ నరేశ్‌కుమార్, సుధాకర్, బాబు, లక్ష్మీనారాయణ ఉన్నారు.

టీహెచ్‌ఓగా కిరణ్ రావడం దురదృష్టకరం

దళిత సంఘం, రైతు సంఘం నాయకులు

పావగడ, జూలై 3 : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఎన్నో అక్రమాలకు పాల్పడిన డాక్టర్ కిరణ్‌ను మళ్లీ ఇప్పుడు పావగడ తాలూకా వైద్యాధికారిగా నియమించడం దురదృష్టకరమని స్థానిక దళిత సంఘం నాయకులు, రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. ప్రైవేట్ క్లినిక్ నడుపుతున్న డాక్టర్ కిరణ్ అక్కడ సరిగా గిట్టుబాటులేకపోవడంతో ప్రభుత్వాసుపత్రిలో నిధులు దోచుకునేందుకు వస్తున్నారని విమర్శించారు. అలాంటి వ్యక్తిని తాలూక వైద్యాధికారిగా నియమించేందుకు ఎమ్మెల్యే చొరవ చూపడం తాలూకా ప్రజలు చేసుకున్న దురదృష్టమన్నారు.

చీనీ చెట్ల నరికివేత

బత్తలపల్లి, జూలై 3: మండలంలోని యర్రయపల్లి గ్రామంలో రైతు శివారెడ్డి చెందిన 66 చీని చెట్లను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. అతను ఏడాది క్రితం మూడెకరాల్లో 430 చీని చెట్లు వేశాడు. బుధవారం ఉదయం పొలానికి వెళ్లిన అతను తన చీనీ చెట్లను నరికి వేసిన విషయం గుర్తించి.. ఎస్‌ఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ, తన సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలిం చారు. కేసు దర్యాప్తులో ఉంది.

తూతూమంత్రంగా సామాజిక తనిఖీలు

అవినీతి కొండంత... రికవరీ గోరంత

లేపాక్షి, జూలై 3 : మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులకు సంబంధించి కళ్లకు కట్టినట్లు అవినీతి కనబడినా సామాజిక తనిఖీలను గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లే తూతూ మంత్రంగా ముగించేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద పీడీ విజయేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం ఉపాధి హామీ పనుల సామాజికి తనిఖీలపై ప్రజా వేదిక నిర్వహించారు. సామాజిక తనిఖీల వివరాలను అధికారులు వెల్లడించారు. మండల వ్యాప్తంగా 800ఉపాధి పనులకుగాను రూ. 11కోట్లు ఖర్చుచేశారు. అందులో కేవలం రూ.75వేలు అవినీతి జరిగినట్లు నిరూపించి, రికవరీకి ఆదేశాలు జారీచేశారు. మండల వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించిన సిబ్బంది మాత్రం రూ. లక్షల్లో అవినీతి జరిగినట్లు రికార్డులు సమర్పించినా అధికారులు రూ. వేలల్లో మాత్రమే రికవరీ చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్బరీ షెడ్లలో అవినీతి జరిగినా పట్టించుకోలేదు. కొండూరు గ్రామంలో జ్యోతి అనే మహిళా రైతు పొలంలో 178జామచెట్లు ఉన్నట్లు రికార్డుల్లో చూపి రూ.లక్ష నిధులను డ్రాచేశారు. అయితే ఆమె పొలంలో ఏ చెట్లులేవని తనిఖీ బృందం నివేదిక సమర్పించింది. కంచిసముద్రం గ్రామంలో రత్నమ్మ అనే మహిళ పొలంలో గట్లు వేసేందుకు రూ.లక్ష ఉపాధి నిధులుకేటాయించారు. అయితే అక్కడ ఏ గట్లు వేయలేదని తనిఖీ బృందం తేల్చింది. మల్బరీ షెడ్లలో అవినీతి జరిగినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేదు. వీరంతా వైసీపీ నేతలే కావడం గమనార్హం. ఉపాధి పనుల్లో పనులు చేయిస్తున్న మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, వైసీపీ ప్రభుత్వంలో పనిచేసినవారే కావడంతో రికవరీ చేయలేకపోయారని, అధికారుల కనుసన్నల్లో నే అవినీతి జరిగిందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఉపాధి పనులు నిర్వహించే స్థలంలో బోర్డు ఏర్పాటు చేసేందుకు ఏపీఓ నిధులు డ్రాచేశారు. అయితే ఎక్కడా బోర్డు ఏర్పాటు చేయలేద ని తేల్చడంతో నిధుల దుర్వినియోగం బయటపడింది. దీంతో ఏపీఓ జ్యోతిపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో నిర్వహించిన సామాజిక తనిఖీల్లో రూ.1.01లక్షలు రికవరీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రికవరీ చేయలేదని అధికారులు తెలిపారు. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేదని అధికారులపై మండల ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాధనం దుర్వినియోగంపై జిల్లా అధికారులు స్పందించి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి పనుల పీడీ విజయేంద్రప్రసాద్, డీవీఓ రమణారెడ్డి, ఏపీడీ శివానందనాయక్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను అడ్డుకున్న రైతులు

గోరంట్ల, జూలై 3: మండలంలోని మల్లెల గ్రామం వద్ద నూతనంగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే పనులను రైతులు బుధవారం అడ్డుకున్నారు. మల్లెల గ్రామ సమీపంలో సర్వేనంబర్లు 42, 22, 28, 37 తదితర వాటిలోని 18మంది రైతులకు చెందిన దాదాపు 15 ఎకరాలకు ప్రభుత్వం నష్టపరి హారం చెల్లించకుండా.... తమ పొలాల్లో పనులు చేపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎకరాకు రూ.17.36లక్షల వంతున పరిహారం ప్రకటించి, పంపిణీ చేసిందన్నారు. అయితే చిన్నపాటి సమస్యల కారణంగా కొంతమందికి పరిహారం ఇవ్వలేదన్నారు. సమస్యలు పరిష్కారమైనా అధికారుల నిర్లక్ష్యం వలన తమకు పరిహారం అందలేదని పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగిన ఫలితంలేదని బాధిత రైతులు అంటున్నారు. తమకు న్యాయం జరిగేవరకు తమ పొలాల్లో రోడ్డు వేయకూడదని వాహనాలకు అడ్డంగా ఆందోళన చేపట్టారు. అధికారులు నిర్వాహకులతో చర్చించి, ఆప్రాంతంలో పనులు ఆపివేయడంతో రైతులు ధర్నా విరమించారు.


హైవే రోడ్డు పనులను అడ్డుకుంటున్న మల్లెల గ్రామ రైతులు

ఈకార్యక్రమంలో బాధిత రైతులు వెంకటాచారి, నారాయణప్ప, ఆవుల లక్ష్మీనరసప్ప, చిన్నరంగప్ప, వీరప్ప, సోము, గంగాద్రి, వెంకటేష్, శ్రీరాములు, చాకలి తిరుపాల్, నాగరాజు తదితరులున్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి: ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

రొళ్ల, జూలై 3: సర్పంచులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ కవిత అధ్యక్షతన మం డల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... అర్హులైన కూలీలందరికి కల్పిం చాలని, జాబ్‌కార్డులున్నా ఇతర ప్రాంతాల్లో ఉన్నవారికి బిల్లులు అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బస్టాండు ఆవరణంలో సులభ్‌కాం ప్లెక్స్, బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న గ్రామ సచివాలయాలను, ఎన్‌టీఆర్ సుజల స్రవంతి పథకాలను వెంటనే పూర్తిచేయాలన్నారు. పట్టుసాగుపై రైతులను ప్రోత్సహించాలన్నారు. మండలంలో ఖాళీగా ఉన్న అన్ని శాఖల పోస్టులను భర్తీ చేసేందుకు కృషి చేస్తామన్నారు. జడ్పీటీసీ అనంతరాజ్ మాట్లాడుతూ ఆర్డీటీ ఇళ్లు మంజూరైనా రెవెన్యూ అధికారులు పట్టాలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ బద్రుజామ, వెటర్నరీ ఏడీ అమర్, ఈఓఆర్‌డీ కిష్టప్ప, డీఈ మనూనాయక్, డీఆర్‌ఏఈ నాగన్న, సీఐ రాజశేఖర్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న కల్వర్టుల పరిశీలన

రొళ: మండలంలోని హొట్టేబెట్ట - కొడగార్లగుట్ట రహదారిలో దెబ్బతిన్న కల్వర్టులను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి బుధవారం పరిశీలించారు. వెంటనే వాటి నిర్మాణాలకు అధికారులు అంచనా తయారు చేయాలని సూచించారు.

సోలార్ పార్క్ ఏర్పాటుకు భూముల పరిశీలన

మడకశిర రూరల్ : మడకశిర ప్రాంతంలో సోలార్ పార్క్ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి బుధవారం సాయంత్రం సోలార్ పార్క్ యజమాని సురేశ్‌తో కలసి భూములను పరిశీలించారు. మండలంలోని బుళ్ళసముద్రం, హరేసముద్రం, మణూరు, కల్లుమర్రి పంచాయతీల పరిధిలో భూములను పరిశీలించారు. పార్క్ ఏర్పాటుకు పది వేల ఎకరాలు సేకరించనున్నట్లు తెలిపారు.

విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేద్దాం

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

హిందూపురం అర్బన్, జూలై 3: విద్యా సమస్యలపై చేపట్టిన దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేద్దామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి పిలుపునిచ్చారు. పట్టణ పరిధిలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో బుధవారం విద్యార్థుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం తలపెట్టిన దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. విద్యా సమస్యలపై సంఘాలు అలుపెరుగని పోరాటాలు చేస్తున్నాయన్నారు. విద్యార్థులే దేశాభివృద్ధికి మూల స్తంభాలన్నారు. అలాంటి విద్యా వ్యస్థను నాశనం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లిఖిత్, తరుణ్, విక్రమ్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

హిందూపురం(పరిగి), జూలై 3 : పది నెలలుగు పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలు చెల్లిందచాలంటూ పరిగి మండలకేంద్రంలోని సచివాలయం వద్ద పారిశుధ్య కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మూడురోజులుగా ధర్నా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం కార్మికులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పది నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. అలాగే ఎనిమిది నెలల అరియర్స్ పోస్ట్ సాంక్షన్ రెన్యువల్ లేదని, సబ్బులు, షాంపూ, నూనె, గ్లౌజులు, చెప్పులు లాంటి మౌలిక సరుకులు పంపిణీ చేయలేదన్నారు. ఎంతో కష్టపడి గ్రామాన్ని శుభ్రంచేసినా వైసీపీ ప్రభుత్వం పారిశుధ్య కార్మికులను మోసం చేసిందని మండిపడ్డారు. వేతనాల గురించి పరిగి పంచా యతీ సర్పంచ్‌ను ప్రశ్నించగా... గత ప్రభుత్వంలో పెట్టిన బిల్లులు మంజూరు కాలేదని తెలిపార న్నారు. టీడీపీ ప్రభుత్వమైనా కష్టపడి పనిచేసే పారిశుధ్య కార్మికులను గుర్తించి వేతనాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్ల పంపిణీ : ఎంఈఓ

అగళి, జూలై 3 : మండలంలోని 45పాఠశాలల్లో చదువుతున్న 3085 మంది విద్యార్థులకు బూట్లు, సాక్సులు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. ఇప్పటికే అన్ని పాఠశాలలకు సరఫరా చేశామన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారని, ఇంకా కొంతమంది పంపిణీ చేయాల్సి ఉందన్నారు. రెండు మూడు రోజుల్లో పంపిణీ కార్యక్రమం పూర్తి అవుతుందని ఎంఈఓ తెలిపారు. కొంతమంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు రావాల్సి ఉందన్నారు. అవికూడా త్వరలోనే వస్తాయని, వాటిని కూడా పంపిణీ చేస్తామన్నారు.

పీడీఓలు బాధ్యతగా పనిచేయండి

పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్ సూచన


పీడీఓల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ, జూలై 3 : తాలూకాలోని 34గ్రామ పంచాయతీలో పీడీఓలు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే వెంకటేశ్ సూచించారు. స్థానిక తాలూకా పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పీడీఓల ప్రగతి పరిశీలన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల ప్రతి పంచాయతీలోనూ పీడీఓల నుంచి అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, వాటిని అధిగమిం చేందుకు ఈఓ జానకీరాం బాధ్యత వహించాలని సూచించారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా విధులు నిర్వహించాలని, ప్రతి పంచాయతీలోనూ తాగునీరు, డ్రైనేజీల సమస్య పరిష్కరిం చాలన్నారు. దోమల వ్యాప్తిని, సీజనల్ వ్యాధులను అరికట్టడానికి గ్రామ పంచాయతీ సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీఓలు, అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

ధర్మవరం, జూలై 3:

పట్టణంలోని సుందరయ్యనగర్ కాలనీకి చెందిన నరసింహులు (78) బుధవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతని భార్య లక్ష్మీదేవి నాలుగు సంవత్సరాల క్రితమే మరణించింది. ఇతనికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నరసింహులు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెదిన ఇతను రేగాటిపల్లి రైల్వే గేటుసమీపంలో బుధవారం ఉదయం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే కీ మెన్ ఇచ్చిన సమాచారం మేరకు హిందూపురం రైల్వేపోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హిందూపురం రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.